
నమస్తే తెలంగాణ
హనుమకొండ
10 వరంగల్, శనివారం 10 మే 2025 HANUMAKONDA



వేయిస్తంభాల ఆలయంలో హనుమాన్ విగ్రహానికి పూజలు చేస్తున్న ప్రధానార్చకుడు ఉపేంద్రశర్మ, భక్తులు



చిట్యాల మండల కేంద్రంలోని కౌసర్ ఏ మసీదులో భారత్ మాతాకీ జై అని నినదిస్తున్న ముస్లింలు

# విజయీభవ..

## భారత సైన్యానికి కొండంత బలమివ్వాలని దేవుళ్లకు మొక్కులు

- పాక్ పన్నాగాలను తిప్పికొట్టే శక్తియుక్తులను ఇవ్వాలని ప్రార్థనలు
- 'ఆపరేషన్ సిందూర్'కు మద్దతుగా ఆలయాలు, మసీదులో పూజలు
- పలుచోట్ల జాతీయ జెండాలతో సంఘీభావ ర్యాలీలు
- నర్సంపేటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

**'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా** పాకిస్తాన్‌తో వీరోచితంగా పోరాడుతున్న భారత సైన్యానికి కొండంత బలం ఇచ్చి.. యుద్ధంలో విజయం సిద్ధించాలని కాంక్షిస్తూ దేవుళ్లను వేడుకుంటున్నారు. పాక్ పన్నాగాలను తిప్పికొట్టే శక్తియుక్తులనివ్వాలంటూ శుక్రవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పలుచోట్ల 'ఆపరేషన్ సిందూర్'కు సంఘీభావంగా జాతీయ జెండాలు చేతబూని ర్యాలీలు తీశారు. ఈ సందర్భంగా భారత సైనికులారా.. మీ వెంటే మేముంటాం, అమర జవాన్లకు జోహార్లు.. జై భారత్ ! జై జై భారత్ ! హిందుస్థాన్ జిందాబాద్' నినాదాలతో హోరెత్తించారు. బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నర్సంపేటలోని అమరవీరుల స్తూపం వద్ద భారత ఆర్మీకి(ఆపరేషన్ సిందూర్) మద్దతుగా, పాకిస్తాన్ ఉగ్ర దాడుల్లో అమరులైన జవాన్ కుటుంబాలకు సంతాపం తెలుపుతూ కొవ్వొత్తులతో ర్యాలీలు నిర్వహించారు.



నర్సంపేట : భారత సైన్యానికి మద్దతుగా సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పట్టణ నాయకులు



కాళేశ్వరంలో పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు







గూడూరు మండల కేంద్రంలో జాతీయ జెండాతో ప్రజల ర్యాలీ



నమస్తే నెట్‌వర్క్, మే 9 : భారత సైన్యానికి సంఘీభావంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కాళేశ్వర–ముక్తీశ్వర ఆలయంలో అధికారులు, భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భారత సైనికుల క్షేమం కోరుతూ హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల ఆలయంలో పూజలు చేశారు. ఎంతో ధైర్యంగా పోరాడుతున్న మన భారత సైన్యానికి ఆ భగవంతుడు మరింత శక్తిని ఇచ్చి విజయపథంలో నడిపించాలని, దేశం సుభిక్షంగా ఉండాలని ఉమ్మడి వరంగల్ జిల్లా సహాయ కమిషనర్ రాముల సునీత, ఈవో అనిల్‌కుమార్, ఆల య ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆకాంక్షించారు. మేడారంలో సమ్మక్క, సారలమ్మల పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆపరేషన్ విజయవంతం కావాలని కోరుతు సమ్మక్క,సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెలపై పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో భారత్ విజయం సాధించాలని, టెర్రరిస్టులు అంతం కావాలని కోరుతూ రామప్ప, కురవి వీరభద్రస్వామి, కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. పాలకుర్తిలోని సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, బచ్చన్నపేట మండలం కొడవటూరు సిద్ధేశ్వరస్వామి ఆలయా ల్లో అర్చకులు, దేవాదాయ శాఖ అధికారులు పూజలు నిర్వహించారు. భారత సైనికులకు మద్దతుగా చిట్యాల మండలకేంద్రంలోని కౌసర్‌ఏ మసీదులో ముస్లిం లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాకిస్తాన్ డౌన్, డౌన్.. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. నర్సంపేటలో బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా భారత సైన్యానికి దేశ ప్రజలంతా అండగా నిలువాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ కోరారు.

### కేటీపీపీలో పోలీసుల భారీ బందోబస్తు

గణపురం, మే 9 : కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలో శుక్రవారం నుంచి పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. నేషనల్ సెక్యూరిటీ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. విధులకు హాజరయ్యే ఉద్యోగులు, కార్మికులు, ఇతర సిబ్బందిని క్షుణ్ణంగా తనిఖీ చేసి ఐడీ కార్డును పరిశీలించాకే కేటీపీపీ మెయిన్ గేట్ నుంచి లోపలికి అనుమతిస్తున్నారు. గతంలో కేటీపీపీ సెక్యూరిటీ అధికారులే ఉద్యోగులను చెక్ చేసి పంపేవారు. తాజాగా 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతున్న క్రమంలో ముందుజాగ్రత్తగా భారీ బందోబస్తు ఏర్పాట్లుచేసినట్లు సమాచారం.

హైఅలర్ట్



తొర్రూరు: బస్టాండ్‌లో బాంబు, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు



తాడ్వాయి: సమ్మక్క, సారలమ్మకు పూజలు చేస్తున్న పూజారులు



భీమదేవరపల్లి: కొత్తకొండ ఆలయంలో పూజలు



వెంకటాపూర్: రామప్ప ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



డోర్నకల్ వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

### దేశ భద్రతకు అంకితమవుతా..



కశ్మీర్‌లో జాతీయ జెండాతో సైనికుడు చంద్రశేఖర్

*జనగామ రూరల్, మే 9 : భారతదేశం, పాకిస్థాన్ మధ్య జరిగిన యుద్ధాలు చరిత్రలో ఎంతో కీలకం. 1947లో విభజన అనంతరం ఏర్పడిన ఈ రెండు దేశాల మధ్య రాజకీయ, భౌగోళిక, మతపరమైన విభేదాలెన్నో యుద్ధాలకు దారితీశాయి. ప్రధానంగా 1947, 1965, 1971, 1999 (కార్గిల్ యుద్ధం) లో తలపడ్డాయి. నేను కశ్మీర్‌లో 3 సంవత్సరాలు పనిచేశా. అక్కడ ఉన్న పరిస్థితులు 2019 తర్వాత చాలా మరాయి. పాకిస్థాన్ ఎప్పుడూ కవ్వింపు చర్యలకు పాల్పడుతూ, టూరిస్టులు, సైనికులపై కాల్పులు జరపడం.., భారత సైనికులు వారికి దీటుగా సమాధానం చెప్పడం చాలాసార్లు జరిగాయి. ఇలాంటి సమయంలో మనం శాంతి కోసం ఎదురు చూస్తూ ఉండలేం కదా.. పాకిస్థాన్‌కు సరైన జవాబు ఇచ్చి తీరాలి. నేను భారతదేశ సైనికుడిగా ఈగడ్డపై జన్మించిన ప్రతి పౌరుడిని రక్షించడం నా ధర్మం. దేశ సరిహద్దుల వద్ద నా సోదరులతో కలిసి నా దేశ భద్రతకు అంకితమవుతా. దేశ సైనికులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి.*

*- కేమిడి చంద్రశేఖర్, సీఐఎస్ఎఫ్ సైనికుడు*

### ఎంజీఎం హాస్పిటల్ వైద్యుల సెలవులు రద్దు

వరంగల్ చౌరస్తా, మే 9: ఎంజీఎం హాస్పిటల్‌లోని వైద్యులకు సెలవులు రద్దు చేశారు. 'ఆపరేషన్ సిందూర్' అనంతరం పాకిస్థాన్‌తో యుద్ధం కొనసాగుతున్న కారణంగా దేశవ్యాప్తంగా అత్యవసర విధులు నిర్వహిస్తున్న విభాగాలకు సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అత్యవసర వైద్యానికి సంబంధించిన ఔషదాలు, పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశాలు జారీకావడంతో సెలవుల్లో ఉన్న ఎంజీఎం వైద్యులు, వైద్యాధికారులు వెంటనే విధులకు హాజరు కావాలని సర్క్యులర్ జారీ చేసినట్లు ఆర్ఎంవో డాక్టర్ శశికుమార్ తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- రోజుల తరబడి ధాన్యం కుప్పల వద్ద రైతుల పడిగాపులు
- మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



రైతులతో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

హసన్‌పర్తి, మే 9: ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గ్రేటర్ వరంగల్ 2 డివిజన్ వంగపహాడ్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్కడున్న రైతులతో మాట్లాడి వారి బాధలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎర్రబెల్లి మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రంలో గన్నీ సంచులు లేక రైతులు ఇబ్బంది పడుతున్నా, కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి, కాంటాల కోసం రోజుల తరబడి కంటిమీద కునుకు లేకుండా పడిగాపులు కాస్తున్నారని, అకాల వర్షాలు మరింత ఇబ్బంది పెడుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను చిన్న చూపు చూస్తూ, వారి ప్రాణాల మీదికి తెస్తున్నదన్నారు. ఈదురుగాలు, అకాల వర్షాలతో దినదిన గండంగా గడుపుతుంటే ప్రభుత్వం మాత్రం మొద్దు నిద్రలో ఉందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఏ ఒక్క రైతు నష్టపోకుండా మద్దతు ధర అందేలా చర్యలు చేపట్టిందన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.500 కోట్ల పంట బోనస్ తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, నాయకులు పాల్గొన్నారు.

**తొర్రూరులో సంఘీభావం తెలిపిన ఎర్రబెల్లి..**

తొర్రూరు, మే 9: తొర్రూరు మండలం కర్కాల, హరిపిరాల గ్రామాల రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెల రోజులుగా ఇబ్బంది పడుతుండగా, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వారికి అండగా నిలిచారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ వీరబ్రహ్మాయ్యతో మాట్లాడారు. ఆయన వెంటనే స్పందించి రెండు లారీలను పంపించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వం నిర్లక్ష్యం, బోనస్ చెల్లింపులో జాప్యం వంటి కారణాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరుతో రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారని, వారి ఉసురు తప్పకుండా తగులుతుందన్నారు.

## నిట్ బీవోజీ చైర్‌పర్సన్‌గా మోహన్‌రెడ్డి



హనుమకొండ చౌరస్తా, మే 9 : నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ (బీవోజీ) చైర్‌పర్సన్‌గా మోహన్‌రెడ్డి నియామకమయ్యారు. ఆరు నెలల కాలానికి లేదా కొత్త చైర్‌పర్సన్ నియామకం వరకు లేదా తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. సైయంట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, ప్రముఖ పరిశ్రమదారుడైన బీవీఆర్ మోహన్‌రెడ్డి నాయకత్వ అనుభవం, పరిశ్రమజ్ఞానంతో దేశంలో సాంకేతిక విద్యాపురోగతికి ఈ బాధ్యతను స్వీకరించారు. ప్రస్తుతం ఆయన ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ రూర్కీ బోర్డ్‌లకు కూడా చైర్‌పర్సన్‌గా సేవలందిస్తున్నారు. దేశానికి ఆయన చేసిన అత్యుత్తమ సేవలకు భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా నిట్ వరంగల్ డైరెక్టర్, సంస్థ చైర్‌పర్సన్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ.. ఇలాంటి సమయంలో మోహన్‌రెడ్డి నిట్‌కు మార్గనిర్దేశం చేయడం తమకు గొప్ప గౌరవమన్నారు.



మర్రి యాదవరెడ్డిని పరామర్శింస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

## మర్రి యాదవరెడ్డికి మాజీ మంత్రి హరీశ్ పరామర్శ

హనుమకొండ చౌరస్తా, మే 9 : కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి తల్లి వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా శుక్రవారం హనుమకొండలో ఆయనతో పాటు కుటుంబసభ్యులను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పరామర్శించారు. వారి వెంట బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, బండ శ్రీనివాస్, నాయకులు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, బండి రజనీకుమార్, టీజీఏ నాయకులు మోటె చిరంజీవి, రవీందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## మరో నాలుగుచోట్ల స్లాట్ బుకింగ్

- ఈ నెల 12 నుంచి అమలు
- జిల్లా రిజిస్ట్రార్ ఫణిందర్

హనుమకొండ, మే 9: ఇప్పటి వరకు తహసీల్దార్ కార్యాలయానికే పరిమితమైన రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ విధానం రాష్ట్ర వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ అమలు చేసేందుకు సర్కారు నిర్ణయించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వరంగల్ రూరల్, ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులను పైలట్ ప్రాజెక్టులో ఎంపిక చేసి స్లాట్ విధానం అమలు చేస్తున్నారు. తాజాగా ఈ నెల 12వ తేదీ నుంచి జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, వరంగల్ ఆర్వో, నర్సంపేట సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులలో అమలు చేస్తున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ డీ ఫణీందర్ తెలిపారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మిగిలిన ఏడు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులలో జూన్ 2వ తేదీ అమలు చేయనున్నారు.

## 14న రామప్ప సందర్శన బంద్

- ప్రపంచ సుందరీమణుల సందర్శనకు సహకరించాలి
- ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర



మాట్లాడుతున్న ములుగు కలెక్టర్, ఎస్పీ

ములుగు, మే 9 (నమస్తే తెలంగాణ) : ప్రపంచ సుందరీమణులు రానున్న నేపథ్యంలో రామప్పలో ఈ నెల 14న పర్యాటకుల సందర్శన పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర తెలిపారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో ఎస్పీ శబరీశ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 14న మిస్‌వరల్డ్ పోటీల్లో సుందరీమణుల్లో 35 మంది రామప్ప వస్తున్నందున పాలంపేట ఆర్చి లోపలికి మధ్యాహ్నం 2గంటల తర్వాత ఎవరికీ అనుమతి లేదన్నారు. దాదాపు 5 కిలోమీటర్ల వరకు డ్రోన్ కెమెరాలను ఎగరవేయడం నిషేధమని పేర్కొన్నారు. మీడియా సెంటర్‌లోనే పాత్రికేయులకు అనుమతి ఉంటుందని, అక్కడినుంచి ముందుకెళ్లడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. సాయంత్రం 4గంటలకు రామప్పకు ప్రపంచ సుందరీమణులు చేరుకుంటారని, వారి పర్యటన మూడు గంటల పాటు సాగుతుందని వివరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు తెలిపేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎస్పీ శబరీశ్ మాట్లాడుతూ రామప్ప ఆలయం సహా పరిసర ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఉంటుందన్నారు. పోలీస్ యంత్రాంగానికి అందరూ సహకరించాలని కోరారు.

## రైతుల భూములు చదును చేసి ఇస్తాం

**- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి**

ఎల్కతుర్తి, మే 9: బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం ఎల్కతుర్తిలో రైతులు ఇచ్చిన భూములను చదును చేసి యథావిధిగా వారికి అప్పగిస్తామని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎల్కతుర్తిలో భూముల చదును పనులను పర్యవేక్షించారు. ఇప్పటికే కాల్వలపై రాకపోకల కోసం పోసిన మట్టిని తొలగించారు. రైతుల భూముల్లో వేసిన తాత్కాలిక రోడ్లను తొలగిస్తూ చదును చేయిస్తున్నారు. భూముల హద్దులను కూడా ఏర్పాటు చేసేందుకు సర్వేయర్లతో హద్దులు పెట్టిసున్నారు. పనులను ముమ్మరం చేసి వర్షాకాలంలోపు పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ నాయకుడు కే రాజ్‌కుమార్, నాయకులు ఎం శరత్, గొల్లె మహేందర్ పాల్గొన్నారు.



భూములను చదును చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు